

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 9లో



పాలిటెక్నిక్ కాలేజీకి ఎన్‌బీఏ గుర్తింపు

యాదగిరిగుట్ట పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ గుర్తింపు లభించింది. - 9లో

గరిష్ఠం/కనిష్ఠం
41°/28°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మోతె పిచ్చిరెడ్డి పదవీ కాలం పొడిగింపు



మోతె పిచ్చిరెడ్డికి ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మోతె పిచ్చిరెడ్డి పదవీకాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కృత్రిమ గర్భధారణతో పాటు పాడి ఉత్పత్తి పెంపునకు చేస్తున్న కృషికి గాను ప్రభుత్వం ఆయన పదవీకాలాన్ని పొడిగించింది. ఈ మేరకు శనివారం నల్లగొండలో మంత్రి జగదీశ్‌రెడ్డి చేతుల మీదుగా మోతె పిచ్చిరెడ్డికి ఉత్తర్వుల కాపీ అందజేశారు.పదవీకాలం పొడిగింపునకు సహకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపారు.

గుట్ట మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బాలకృష్ణ

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట మున్సిపల్ నూతన కమిషనర్‌గా నల్లమాల్ల బాలకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌన్సిలర్లు, ప్రజల సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.

స్వయం ఉపాధి యూనిట్లకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి టౌన్ : 2023 – 24 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం కింద స్వయం ఉపాధి యూనిట్ల మంజూరీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తయారీ, సేవారంగంలో బ్యాంకు సహకారంతో యూనిట్లు నెలకొల్పడానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. తయారీ రంగంలో రూ.50 లక్షలు, సేవా రంగంలో రూ.20 లక్షలకు మించకుండా ప్రాజెక్టు నెలకొల్పవచ్చన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు www.kviconine.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు భువనగిరిలోని జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అన్వితారెడ్డికి సన్మానం



అన్వితారెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్లు

భువనగిరి : డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భువనగిరిలో ఏర్పాటు చేసిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎవరెస్టు పర్వతారోహకురాలు అన్వితారెడ్డిని సన్మానించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పలువురు డాక్టర్లు మాట్లాడుతూ అమెరికాలోని ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించి భారత దేశ ఖ్యాతిని ప్రపంచవ్యాప్తంగా చాటారని కొనియాడారు. మున్ముందు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ భార్గవ్, డాక్టర్లు పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు



కల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వేకువజామున ఆలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం, సహస్ర నామార్చన, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ముఖమండపంలోని సువర్ణమూర్తుల వద్ద సువర్ణ పుష్పార్చన గావించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు చేశారు.

పదేళ్ల పండుగకు సన్నద్ధం

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

- జూన్ 2 నుంచి 21 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు
- ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యం
- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ గొంగిడి సునీత
- శాఖల వారీగా ప్రగతి నివేదికల తయారీలో అధికారులు నిమగ్నం



సాక్షి, యాదాద్రి : పోరాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రం పదో వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2నుంచి 22వ తేదీ వరకు రోజుకో కార్యక్రమం నిర్వహించనుంది. సీఎం కేసీఆర్ ఈనెల 25న రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్లు, పోలీసు అధికారులతో సమావేశమై దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది. 21 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులను భాగస్వాములను చేయనున్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. పోడు భూముల పట్టాల పంపిణీ, ఇళ్ల పట్టాల పంపిణీ, తెలంగాణకు హరితహారం, రాష్ట్ర అవతరణ వేడుకలతో పాటు తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఆయా కార్యక్రమాల్లో ప్రజలకు వివరించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రగతి నివేదికలను శాఖల వారీగా అధికారులు రూపొందిస్తున్నారు.

రోజువారీ కార్యక్రమాలు ఇలా..

జూన్ 2 : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి తొమ్మిదేళ్లలో జిల్లా సాధించిన ప్రగతి, దశాబ్ది ఉత్సవాలపై ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శేఖర్‌రెడ్డి, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ ఎమ్మెల్యేలు, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, డీసీపీతో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

3న : జిల్లాలోని 92 రైతు వేదికల్లో రైతులతో కలిసి ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సహపంక్తి భోజనం చేస్తారు.

4న : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్‌శాఖ నిర్వహించే సురక్షా దినోత్సవం సందర్భంగా ర్యాలీలు నిర్వహిస్తారు. పోలీస్ శాఖ చేపట్టిన పలు అంశాలను వివరిస్తారు.

5న : వ్యవసాయానికి సరఫరా చేస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌తో పాటు ఇతర సేవలను ప్రజలకు వివరిస్తారు. నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. విద్యుత్ కార్యాలయాలు, సబ్ స్టేషన్లను లైట్లు, పూలతో అలంకరిస్తారు. విద్యుత్‌శాఖ సాధించిన విజయాలను కరపత్రాల రూపంలో ప్రజలకు పంపిణీ చేస్తారు.

6న : టీఎస్ ఐపాస్ ద్వారా జిల్లా సాధించిన ప్రగతిని వివరించనున్నారు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లోని గ్రీన్ ఇండస్ట్రీయల్ పార్క్ సాధించిన ప్రగతిపై ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించనున్నారు.

7న : సాగునీటి దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారు.

8న : ఊరూరా చెరువుల పండుగ నిర్వహిస్తారు. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా జరిగిన అభివృద్ధిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతారు. సహపంక్తి భోజనాలు చేస్తారు.

9న : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై సంబరాలు నిర్వహిస్తారు. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి తొమ్మిదేళ్ల సంక్షేమాన్ని వివరిస్తారు. పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, గొర్రెల పంపిణీ, కులవృత్తులకు రూ.1లక్ష రుణం పథకానికి శ్రీకారం చుట్టనున్నారు.

10న : సుపరిపాలనలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలు, మండలాల్లో ప్రజలకు పాలన చేరువైన విషయాన్ని వివరిస్తారు.

11న : జిల్లా కేంద్రంలో సాహిత్య కార్యక్రమాలు, కవి సమ్మేళనాలు, కవులకు సన్మానాలు ఉంటాయి.

12న : పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఉదయం తెలంగాణ రన్ నిర్వహిస్తారు.

13న : మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులతో మాట్లాడిస్తారు. ఉత్తమ మహిళా అధికారులు, ఉద్యోగినులను సన్మానిస్తారు.

14న: వైద్యారోగ్య శాఖ దినోత్సవాన్ని నియోజకవర్గస్థాయిలో నిర్వహిస్తారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, డయాలసిస్ సేవలు, వైద్య సేవల వంటి పథకాలను ప్రజలకువివరిస్తారు.

15న : గ్రామ పంచాయతీల్లో పల్లెప్రగతి దినోత్సవం నిర్వహిస్తారు. పల్లె ప్రగతి ద్వారా సాధించిన ప్రగతిని చూపే ఫొటో గ్యాలరీలు ఏర్పాటు చేస్తారు.

16న : మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతి వేడుకలు నిర్వహిస్తారు. అభివృద్ధిని తెలియజేసే చాయచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.

17న : తెలంగాణ గిరిజన దినోత్సవం నిర్వహించనున్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరిస్తారు.

18న : మంచినీళ్ల పండుగ నిర్వహిస్తారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాల ద్వారా సరఫరా చేస్తున్న నీటి గురించి ప్రజలకు వివరిస్తారు. భగీరథ నీటి ట్యాంకులను సందర్శిస్తారు.

19న : హరిత ఉత్సవంలో భాగంగా పట్టణం, పల్లె అనే తేడా లేకుండా మొక్కలు నాటుతారు.

20న : విద్యా దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థలను అలంకరిస్తారు. మన ఊరు – మన బడి కార్యక్రమంలో చేపట్టిన పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభిస్తారు.

21న : ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహిస్తారు. యాదాద్రి పుణ్యక్షేత్రంతో పాటు ఆలయాలు, చర్చిలు, మసీదులను అలంకరించి పూజలు నిర్వహిస్తారు.

22న : మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లు, గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి అమరవీరులకు నివాళులర్పిస్తారు.

పండుగ వాతావరణంలో నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సాక్షి,యాదాద్రి : తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి జిల్లా అధికారులను కోరారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అన్ని శాఖల అధికారులతో సమావేశమై దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సమీక్షించారు. జూన్ 2నుంచి 22వ తేదీ వరకు 21 రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలన్నీ విజయవంతం కావాలన్నారు. 2న కలెక్టరేట్‌లో నిర్వహించే వేడుకలకు చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

చౌటుప్పల్ : వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త మరింత కష్టపడి పని చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తూ చౌటుప్పల్‌లో ఆగారు. స్థానికంగా ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన పార్టీ నాయకుడి కుటుంబ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతలంతా పార్టీకోసం అధిక సమయం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, ఊడుగు వెంకటేశం, బత్తుల జంగయ్య, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి, దాసోజు భిక్షమాచారి, బాతరాజు సత్యం, మునగాల తిరుపతిరెడ్డి, ఏసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వనం ధనుంజయ్య, రాధారపు సత్తయ్య, కాసుల వెంకటేశం, కట్ట కృష్ణ, లగ్గోని పాండు, మునగాల రాజశేఖర్‌రెడ్డి, దిండు భాస్కర్, పక్కీరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విడుదల

యాదగిరిగుట్ట రూరల్ : బస్వాపురం రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న యాదగిరిగుట్ట మండలం లప్పానాయక్ తండాకు ప్రభుత్వం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ నిధులు విడుదల చేసిందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రూ.28.10 కోట్లు విడుదలైనట్లు వెల్లడించారు. తండావాసులకు దాతర్‌పల్లిలోని 294 సర్వే నంబర్‌లో లే అవుట్ చేసి అందులో పునరావాసం కల్పిస్తుందన్నారు. వచ్చిన నిధుల్లో కోటి రూపాయలు పునరావాస కాలనీలో తాగునీటికి, రూ.26.50, లే అవుట్ అభివృద్ధికి, రూ.60లక్షలు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కేటాయించనున్నట్లు తెలిపారు. లే అవుట్ అభివృద్ధికోసం త్వరలో టెండర్లు పిలువనున్నట్లు పేర్కొన్నారు.

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం



మొబైల్ టాయిలెట్లను ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- కలెక్టర్ పమేలా సత్పతి

సంస్థాన్ నారాయణపురం : రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా జిల్లాలో ప్రతి మంగళవారం రెండు చోట్ల ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఫిక్కి ఎఫ్ఎల్‌వో సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకలో మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అదే విధంగా ప్రపంచ రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిక్కి ఎఫ్ఎల్ఓ సంస్థ చైర్ పర్సన్ రీతూషా మాట్లాడుతూ తేలియా రుమాల్ తయారీకి పుట్టపాక ప్రసిద్ధి అని తెలిపారు. క్రాఫ్ట్‌ను ప్రోత్సహించడానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం శానిటరీ ప్యాడ్‌లు, మొబైల్ టాయిలెట్లు, శానిటరీ ప్యాడ్స్ వెండింగ్ మెషిన్ మరియు ఇన్సినరేటర్‌ను పుట్టపాక గ్రామస్తులకు సంస్థ నిర్వాహకులు అందజేశారు. టెన్త్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎఫ్ఎల్ఓ సభ్యురాలు సీతారెడి, సరితారావు, డాక్టర్ శ్వేతా అగర్వాల్, ఎంపీపీ ఉమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌రాజు, ఏపీడీ జోజప్ప, ఏపీఎం యాదయ్య, సర్పంచ్ సామల భాస్కర్, ఎంపీటీసీ మర్రి వసంత, వర్కాల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలి

సాక్షి,యాదాద్రి : సీఎం కప్ క్రీడా పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు అక్కడ కూడా రాణించి జిల్లాకు పేరు తీసుకురావాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్న క్రీడాకారుల బస్సులను ఆమె ప్రారంభించారు. జిల్లా నుంచి 138 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వీరంతా జింఖానాగ్రౌండ్స్, లాల్‌బహదూర్ స్టేడియం, గచ్చిబౌలి స్టేడియం, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి అండాలు ఉన్నారు.

దేశానికే తెలంగాణ దిక్సూచి



డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

ఆలేరురూరల్ : అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శమని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆలేరు మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.90కోట్లతో స్ట్రాం వాటర్ డ్రెయిన్ నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పల్లెలు, పట్టణాల్లో దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధిలో దేశానికి దిక్సూచిగా తెలంగాణ నిలుస్తుందన్నారు. ఆలేరు మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కాగా 12వ వార్డుకు తాగునీరు సరఫరా కావడం లేదని స్థానిక మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, కౌన్సిలర్లు బేతిరాములు, రాయపురం నర్సింహులు, జూకంటి సంపత్, బీఆర్ఎస్ ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, సింగల్ విండో చైర్మన్ మల్లేషం, నాయకులు చింతకింది మురళీ, దాసి సంతోష్, జెల్లి నర్సింహులు, బాలస్వామి, గ్యాదపాక నాగరాజు, మొరిగాడి వెంకటేష్, కుండె సంపత్, కూళ్ల సిద్ధులు తదితరులు పాల్గొన్నారు.

పదవి భార్యలది.. పెత్తనం భర్తలది!

ఆలేరులో స్ట్రాం వాటర్ డ్రెన్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి పలువురు మహిళా కౌన్సిలర్లు హాజరు కావల్సి ఉంది. కానీ, వారికి బదులు వారి భర్తలు వచ్చి కొబ్బరికాయలు కొట్టడం చర్చనీయాంశమైంది.ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కాకపోతే ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని, తమ ఇబ్బందులను ఎవరికి చెప్పుకోవాలని అక్కడున్న మహిళలు నాయకులను ప్రశ్నించారు.

36 కి.మీ.. 360 ఎకరాలు!

గౌరెల్లి - కొత్తగూడెం హైవే కోసం జిల్లాలో భూ సేకరణ

- చురుగ్గా సాగుతున్న సర్వే
- పూర్తి కాగానే గెజిట్ నోటిఫికేషన్
- బాధిత రైతులకు సమాచారం





భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి, జగత్‌పల్లి గ్రామాల మధ్య వ్యవసాయ భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు

భూదాన్‌పోచంపల్లి : రంగారెడ్డి జిల్లా గౌరెల్లి ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి కొత్తగూడెం జంక్షన్ వరకు చేపట్టనున్న 930 పి జాతీయ రహదారి భూ సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 19న భూదాన్‌పోచంపల్లి మండలం పిలాయిపల్లి గ్రామంలోని 452, 453 సర్వే నంబర్లలో సర్వే మొదలైంది. వరికోతలు పూర్తయిన నేపథ్యంలో రెవెన్యూ, ల్యాండ్ సర్వే అధికారులు సర్వే పనుల్లో వేగం పెంచారు. ఆయా భూముల్లో ఏయే పంటలు పండిస్తున్నారు, భూమి స్వభావం తదితర అంశాలను నమోదు చేసుకుంటున్నారు.

సేకరించనున్న భూమి..

జాతీయ రహదారి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం రూ.675 కోట్లు మంజూరు చేసింది. భూ సేకరణ కోసం ఇటీవల జాతీయ రహదారుల సంస్థ గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. యాదాద్రి జిల్లా పరిధిలోని భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల్లో 36 కిలో మీటర్ల జాతీయ రహదారి నిర్మాణం కోసం 360 ఎకరాలకు పైగా భూమి అవసరం పడుతుంది. అందులో భూదాన్‌పోచంపల్లి మండలంలో 200, వలిగొండ మండలంలో 160 ఎకరాలు సేకరించనున్నారు. జాతీయ రహదారి వెళ్తున్న గ్రామాల పరిధిలోని బాధిత రైతులకు సమాచారం ఇచ్చారు. సర్వే చేయడానికి ముందు రోజే గ్రామాల్లో చాటింపు వేస్తున్నారు.

వలిగొండ వరకు 150 ఫీట్ల రోడ్డు

గ్రామాలను తాకకుండా గౌరెల్లి నుంచి వలిగొండ వరకు 150 ఫీట్ల వెడల్పుతో రెండు లేన్ల బైపాస్ రోడ్డు నిర్మించనున్నారు. అలాగే తొర్రూర్, నెల్లికుదూర్, రావిరాల, మహబూబాబాద్, ఇల్లందు వద్ద సుమారు 25 కిలో మీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించనున్నారు. ఇల్లందు నుంచి కొత్తగూడెం వరకు మాత్రం 40కిలో మీటర్లు నాలుగు లేన్ల రోడ్డు నిర్మిస్తున్నారు.

పంటలు వేయొద్దని ఆదేశం

భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిలాయిపల్లి, జగత్‌పల్లి, జూలూరు, పోచంపల్లి, భీమనపల్లి, మెహర్‌నగర్, కనుముకుల, దంతూర్, వంకమామిడి, ధర్మారెడ్డిపల్లి, వలిగొండ మండలం సంగెం, పొద్దటూరు, రెడ్లరేపాక, మల్లేపల్లి, లోతుకుంట గ్రామాల్లోని పంట భూముల్లో నుంచి జాతీయ రహదారి వెళ్లనుంది. రైతులు వచ్చే సీజన్ నుంచి ఎలాంటి పంటలు వేయవద్దని అధికారులు ఆదేశించారు.


నాలుగు ప్యాకేజీలుగా విభజన

రంగారెడ్డి జిల్లా గౌరెల్లి ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి కొత్తగూడెం జంక్షన్ వరకు సుమారు 230 కిలో మీటర్ల మేర నిర్మిస్తున్న 930 పి జాతీయ రహదారి పనులను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. గౌరెల్లి నుంచి వలిగొండ (గ్రీన్ ఫీల్డ్ కొత్తరోడ్డు), వలిగొండ నుంచి తొర్రూర్ (పాత రోడ్డు విస్తరించుట), తొర్రూర్ నుంచి నెహ్రూనగర్, నెహ్రూనగర్ నుంచి కొత్తగూడెం జంక్షన్ వరకు జాతీయ రహదారిని నిర్మించనున్నారు.

పరిహారం రూ.30 లక్షల లోపే..

జాతీయ రహదారి నిర్మాణం కోసం భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల పరిధిలో చేపడుతున్న భూమి చాలా వరకు సేద్యంలో ఉంది. మూసీ ఆయకట్టు కావడంతో రైతులు ఏటా రెండు పర్యాయాలు పంటలు పండించుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే ప్రస్తుతం పోచంపల్లి మండలంలో రిజిస్ట్రేషన్ ప్రకారం మార్కెట్ విలువ రూ.7.50 లక్షల వరకు ఉంది. దీనికి మూడు రెట్లు కలుపుకొని, 12శాతం వడ్డీతో ఇస్తే సగటున ఎకరాకు రూ.30 లక్షల లోపు పరిహారం అందే అవకాశం ఉంది. కానీ, ఈ మండలాల్లో సాగుభూమి ఎకరాకు రూ.80లక్షల నుంచి కోటి రూపాయల వరకు ధర పలుకుతుంది. సేద్యం చేసుకుంటున్న భూములు కోల్పోతున్నామని, పరిహారాన్ని పెంచి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.


3 ఎకరాలు పోతుంది



మాకున్న 8 ఎకరాల్లో వరి పండించుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. జాతీయరహదారి కోసం 3 ఎకరాల భూమి పోతుంది. అది కూడా పొలాల మధ్య నుంచి పోతుండటంతో ఇరు పక్కలా భూమి కోసులు మిగిలి ఎటు కాకుండా ఉంది. ఎదో ఒక పక్కన నుంచి భూమి తీసుకోవాలని విజ్ఞప్తి చేసినా అధికారులు స్పందించడంలేదు. తీవ్రంగా నష్టపోవల్సి వస్తుంది.

–బీరెడ్డి మల్లారెడ్డి, రైతు, పిలాయిపల్లి

పరిహారం పెంచాలి



నాకు మూడెకరాల భూమి ఉండే. గతంలో పిలాయిపల్లి కాలువ కోసం అర ఎకరం పోయింది. ఇప్పుడు జాతీయ రహదారి కోసం మరో ఎకరం పోయేటట్టు ఉంది. వ్యవసాయం చేసుకొని బతుకుతోళ్లం. భూమిపోతే ఏంచేసుకొని బతకాలి. రిజిస్ట్రేషన్ విలువ కాకుండా మానవతా దృక్పథంతో మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.80లక్షలు పరిహారం చెల్లించాలి.

–అందెల నర్సింహ, రైతు, పిలాయిపల్లి

సర్వే పూర్తి కాగానే గెజిట్ నోటిఫికేషన్



గౌరెల్లి నుంచి వలిగొండ వర కు గ్రీన్‌ఫీల్డ్ భూ సర్వే పనులు జరుగుతున్నాయి. సర్వే పూర్తి కాగానే భూములు కోల్పోతున్న రైతుల జాబితాను నేషనల్ హైవే అథారిటీకి పంపించి గెజిట్ నోటిఫికేషన్ తయారు చేయిస్తాం. రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా 12శాతం వడ్డీ కలిపి రైతులకు నేషనల్ హైవే అథారిటీ పరిహారం చెల్లిస్తుంది. రైతులకు అభ్యంతరాలుంటే కలెక్టర్, ఆర్డీఓకు విన్నవించుకోవచ్చు.

–రంజిత్‌సింగ్, షెరాడియా కన్సల్టెంట్ భూసేకరణ ప్రతినిధి

క్లుప్తంగా

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో శనివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో పలు కూరగాయల దుకాణాలు దగ్ధమయ్యాయి. స్థానిక మార్కెట్ లో పాత గ్రామపంచాయతీ కార్యాలయం ముందు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కింది భాగంలో ఉన్న రిటైల్ దుకాణాల్లో తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో సర్వీస్‌రోడ్డు నుంచి వరుసగా ఉన్న పాశం సావిత్రమ్మ, తిరుపతమ్మ, అంజయ్య, పెద్దఅండాలుకు చెందిన దుకాణాల్లో మంటల చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపకశాఖకు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పడంతో ఇతర దుకాణాలకు ముప్పు తప్పింది. తమకు తీవ్ర నష్టం జరిగిందని దుకాణ యజమానులు బోరున విలపించారు. ఆదుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు కావాలని నిప్పంటించి ఉంటారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వడదెబ్బతో కూలీ మృతి

తుంగతుర్తి: వడదెబ్బతో ఉపాధి కూలీ మృతిచెందాడు. ఈ ఘటన వెంపటి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన కొండ వీరస్వామి (75) ఉదయం గ్రామంలోని అవుసలోని కుంటలో ఉపాధి పనులకు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో తోటి కూలీలు మంచినీళ్లు తాపించి, ప్రథమ చికిత్స అందిస్తుండగానే మృతిచెందాడు. మృతుడికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

యాదాద్రిలో ప్రముఖుల పూజలు



శ్రీహయగ్రీవ స్వామి వారి ఆలయంలో కుటుంబ సభ్యులతో సంపూర్ణేష్‌బాబు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని జార్ఖండ్ డీజీ రవిశంకర్, డీఈజీ విజయలక్ష్మి, బిహార్ ఏసీబీ డీఐజీ ప్రేమలత, నాగాలాండ్ ఐజీ రూప, సిమ్లా ఎస్‌ఐబీ డీఐజీ అమొంగ్లా, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూలను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ పర్యవేక్షకుడు ఊడెపు రాజు లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం సంపూర్ణేష్‌బాబు కుటుంబ సభ్యులు యాదగిరిపల్లి సమీపంలోని శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి నిత్యం శ్రీలక్ష్మీహయగ్రీవ స్వామి ఆరాధన, గో సేవ చేస్తూ సనాతన ధర్మాన్ని పాటిస్తుండటం గొప్ప విషయమని పేర్కొన్నారు.

మోతె ఎస్‌ఐని సస్పెండ్ చేయాలి



మోతె పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- సీపీఎం నాయకురాలు మల్లు లక్ష్మి డిమాండ్
- పార్టీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన

మోతె : పేదల పక్షాన శాంతియుతంగా పోరాడుతున్న సీపీఎం నాయకులు, మహిళా కార్యకర్తలపై దాడి చేసిన మోతె ఎస్‌ఐ మహేష్‌ను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ఆందోళనలో ఆమె పాల్గొని మాట్లాడారు. మోతె మండల పరిధిలోని విభళాపురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లను అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. పేదలకు న్యాయం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. అర్హులకు న్యాయం చేయాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు, మండల కార్యదర్శి ముల్కూర్ గోపాల్‌రెడ్డితో పాటు మహిళా కార్యకర్తలపై మోతె ఎస్‌ఐ, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు దాడులు చేయడం ఎంత వరకు సబబు అని ఆమె ప్రశ్నించారు. న్యాయం చేయాలని పేదలు ఆందోళన చేస్తున్నా కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేసులకు భయపడేది లేదని, పేదలకు న్యాయం జరిగేంత వరకు సీపీఎం పోరాడుతుందని స్పష్టం చేశారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సూరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, ముల్కలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, నాగం మల్లయ్య, కిన్నెర పోతయ్య, కుంచం గోపి, వెలుగు మధు, సోమగాని మల్లయ్య, పెరుమళ్ల నాగమణి, కల్లెపల్లి సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ సెంటర్ యువతకు ఉపయోగం



స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యేలు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్ నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా ప్రాంగణంలోని డీపీఆర్‌సీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టడీ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అధ్యయన కేంద్రంగా సెంటర్‌ను తీర్చిదిద్దాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. అభ్యర్థులకు కోచింగ్‌ల ఖర్చుభారం తగ్గించాలన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో గ్రంథాలయాలను విస్తరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నోముల భగత్, జెడ్పీ వైస్ చైర్మన్ ఇగిరి పెద్దులు, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

- అపార్ట్‌మెంట్ పైనుంచి పడడంతో మృత్యువాత
- మృతురాలు మిర్యాలగూడలోని సుందర్‌నగర్‌కు చెందిన శోభగా గుర్తింపు
- కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు



శోభ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందింది. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగార్జుననగర్‌లో గల వైష్ణవి అపార్టుమెంట్‌పై నుంచి ఓ యువతి పడడంతో స్థానికులు గుర్తించి ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. ఏరియా ఆస్పత్రికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు యువతి ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. సదరు యువతి పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన శోభగా గుర్తించారు. చికిత్స అందిస్తుడగానే యువతి మృతిచెందింది. దీంతో డీఎస్పీ వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి చేరుకుని యువతి మృతదేహాన్ని పరిశీలించారు. యువతి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన పోలీసులు తెలిపారు.

అనుమానాలెన్నో..

శోభ మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అపార్ట్‌మెంట్ మెత్తం సీసీ పుటేజీ నిఘాలో ఉండటంతో పాటు నిత్యం వాచ్‌మన్ డ్యూటీలోనే ఉంటాడు. కొత్తవారు ఎవరు వచ్చినా లోనికి వెళ్లే పరిస్థితి ఉండదు. కాగా మృతురాలు శోభ గతంలో ఓ ఆస్పత్రిలో నర్సుగా పని చేసిందని సమాచారం. ఆ యువతి అపార్ట్‌మెంట్‌కు ఎందుకు వెళ్లింది?, అపార్ట్‌మెంట్ పైనుంచి ప్రమాదవశాత్తు పడిందా..? లేకా ఎవరైనా కావాలని తోశారా..? అనే విషయం తెలియాల్సి ఉంది. పోలీసులు సీసీ పుటేజీని పరిశీలిస్తే యువతి మృతిపై మిస్టరీ వీడనుంది.

చౌటుప్పల్‌లో వ్యక్తి..



బత్తుల నరేందర్ మృతదేహం

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని 9వ వార్డు పరిధి చిన్నకొండూర్ రోడ్డులో శనివారం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బత్తుల యాదగిరి-రాజమణి దంపతులకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నకుమారుడైన బత్తుల నరేందర్(38) చేనేత వృత్తితోపాటు గ్లాస్ ఫిటింగ్, ఫ్లై ఉడ్ వర్క్ చేస్తుంటాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన అతను పట్టణంలోని తంగడపల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన స్నేహితుడికి సంబంధించిన వివాహానికి హాజరైనట్టుగా తెలిసింది. మధ్యాహ్నం తర్వాత ఇంటికి చేరుకున్నాడు. ఆ సమయంలో ఇంటి ఆవరణలో చేనేత పని చేసుకుంటున్న తల్లి అతన్ని చూసింది. ఎక్కడికి వెళ్లి వస్తున్నావు, భోజనం చేశావా అని అడిగింది. తాను భోజనం చేశానని చెప్పి ఇంట్లోకి వెళ్లి ప్యాంటు, షర్టు విప్పేసి షాట్ ధరించి బెడ్రూంలో పడుకున్నాడు. ఆ క్రమంలో లోపలికి వెళ్లిన వ్యక్తి చాలాపేపటి వరకు కూడా బయటకు రాకపోవడంతో వదిన సత్యలక్ష్మి రాత్రి 7గంటల ప్రాంతంలో బెడ్రూంలోపలికి వెళ్లి చూసింది. అప్పటికే కదలికలు లేకపోవడంతో కుటుంబ సభ్యులను పిలిచింది. వారంతా పరిశీలించగా చనిపోయినట్టుగా నిర్ధారించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సైదులు ఘటనా స్థలానికి వెళ్లి ఇంటిని పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. శరీరంపై పలు చోట్ల గాయాలు ఉండడంతో ఎవరైనా కొట్టడంతో ఇలా జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం నివేదిక తర్వాత వాస్తవాలు తెలుస్తాయని ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

దేవరకొండ: గుర్రంపోడు మండలం కొప్పోల్ గ్రామంలో ఇటీవల జరిగిన యువకుడి హత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. కొప్పోల్ గ్రామానికి చెందిన ఆవుల మల్లయ్య కుమార్తె నల్లగొండలో చదువుతున్న క్రమంలో కట్టంగూర్ మండలం దుగినేపల్లికి చెందిన బొడ్డు సంతోష్(18)తో పరిచయం ఏర్పడి అదికాస్తా ప్రేమగా మారింది. వీరి ప్రేమ విషయం తెలుసుకున్న అమ్మాయి తల్లిదండ్రులు మూడు నెలల క్రితం షీ టీం పోలీసులకు ఫిర్యాదు చేసి కౌన్సిలింగ్ ఇప్పించారు. వారిలో మార్పు రాకపోవడంతో పాటు వారిరువురు ఫోన్‌లో తరుచూ మాట్లాడుకుంటున్నారు.ఈ క్రమంలోనే ఈనెల 25న సంతోష్ అమ్మాయి స్వగ్రామమైన కొప్పోల్‌కు వచ్చాడు. ఎవరూ లేని సమయంలో అమ్మాయి ఇంట్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కూలికి వెళ్లి ఇంటికి తిరిగి వచ్చిన అమ్మాయి తండ్రి మల్లయ్య వారిని చూసి కోపోద్రిక్తుడయ్యాడు. వెంటనే తమ సమీప బంధువైన ఆవుల నగేష్‌తో పాటు తన తల్లి రాములమ్మను పిలిచి రోకలి బండలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కొండమల్లేపల్లి సిఐ శ్రీనివాసులు,ఎస్‌ఐ శివప్రసాద్,తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



బాలుర విభాగంలో మొదటి బహుమతి అందుకుంటున్న మేడ్చల్ మల్కాజిగిరి జట్టు

- ముగిసిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ యూత్‌చాంపియన్ షిప్ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎంపీ బడుగుల

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రాజ్యసబ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. క్రీడాకారులు అంది వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ తమలోని ప్రతిభను మెరుగుపరుచుకొని రాష్ట్ర , జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. గతంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడంతో పాటు ప్రస్తుతం రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలు నిర్వహించిన ఘనత రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ సీఈవో సురేష్, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, టీఆర్‌ఎస్ నాయకుడు వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ భిక్షం, ఆజంబాబు పాల్గొన్నారు.



బాలికల విభాగంలో రెండో బహుమతి అందుకుంటున్న అందుకుంటున్న ములుగు జట్టు

విజేతలు వీరే..

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతలుగా ఆయా జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి ములుగు, బాలుర విభాగంలో మొదటి బహుమతి మేడ్చల్ మల్కాజిగిరి, ద్వితీయ బహుమతి వికారాబాద్ జిల్లాలు కైవసం చేసుకున్నారు.

రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యం

- ఎల్‌డీఎం ప్రోగ్రాం రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రీతమ్, వెంకన్న

తిరుమలగిరి (తుంగతుర్తి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 31 ఎస్సీ, ఎస్టీ రిజర్వ్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడమే లక్ష్యంగా లీడర్ షిప్ డెవలప్‌మెంట్ మిషన్ (ఎల్‌డీఎం)ను అధిష్టానం ఏర్పాటు చేసిందని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎల్‌డీఎం ప్రోగ్రాం రాష్ట్ర చైర్మన్ నాగరిగారి ప్రీతమ్, సూర్యాపేట డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్ తెలిపారు. తిరుమలగిరిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తుంగతుర్తి నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో ఎల్‌డీఎం ప్రోగ్రాంపై శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్సేనని అన్నారు. దళిత నియోజకవర్గాల్లో పార్టీని విస్తృతం చేయడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులను సమన్వయం చేసి పార్టీ అభ్యర్థి గెలుపునకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. .సమావేశంలో తుంగతుర్తి నియోజకవర్గ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి బాల లక్ష్మి, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడిపాటి నర్సయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు అనురాధ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ అమరవరపు శ్రీనివాస్, మైనార్టీ సెల్ చైర్మన్ నిజామొద్దీన్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్, సీనియర్ నాయకులు అన్నెపర్తి జ్ఞానసుందర్, ఇటికాల చిరంజీవి, బ్లాక్ కాంగ్రెస్ , మండలాల పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తమ్మినేని వీరభద్రం తదితరులు

హుజూర్‌నగర్ : దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమ్యూనిస్టులతోనే సాధ్యమవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్త పులిచింతల వెంకట్‌రెడ్డి ఆకస్మికంగా మృతిచెందడంతో కుటుంబ సభ్యులు శనివారం హుజూర్‌నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో తమ్మినేని వీరభద్రం పాల్గొని వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. దేశంలో కాలానుగుణంగా మారుతున్న పరిస్థితుల నడుమ తాత్కాలికంగా కొంతమేర బలహీనపడ్డ చివరకు ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని ఆయన పేర్కొన్నారు. కార్యమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, రాష్ట్ర నాయకులు నంద్యాల నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు ఎస్ పాండు, ఎస్.వెంకటేశ్వర్లు, కె.యాదగిరిరావు, పి.వెంకటరెడ్డి, డి.బ్రహ్మం, వి.సైదులు, యాకోబ్, రవి, శ్రీరాములు, పి.శేఖర్‌రావు, హుస్సేన్, శీలం శ్రీను, త్రివేణి పాల్గొన్నారు.

అఖిలపక్ష నాయకుల సంతాపం

పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్, సీపీఐ, న్యూడెమోక్రసీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు అఖిల పక్ష నాయకులు వెంకటరెడ్డి అంతిమ యాత్రలో పాల్గొని సంతాపం తెలిపారు. వారిలో సీపీఐ రాష్ట్ర నాయకులు పశ్యపద్మ, యల్లావుల రాములు, కంబాల శ్రీనివాస్, కొప్పోజు సూర్యనారాయణ, ఒక్కవంతుల కోటేశ్వరరావు, యలక వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో కొత్తగా డిగ్రీ కోర్సులు



హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న 'దోస్త్' కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాల నందు 2023–24 విద్యా సంవత్సరానికి కొత్తగా బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్, బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) కోర్సులు ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్జీ కళాశాలలో 1620 సీట్లు ఉండగా అందులో బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 360, లైఫ్ సైన్స్‌లో 360, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్ అండ్ టాక్సేషన్స్‌లో 420, బీఏ 240, బీబీఏలో 120, బీఎస్సీ హానర్స్ కంప్యూటర్ సైన్స్‌లో 60, బీసీఏలో 60 సీట్లు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు www.dost.cgg.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు రిజిస్ట్రేషన్ చేసుకొని, కోర్సులకు వెబ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు.

హెల్ప్‌లైన్ సెంటర్ ప్రారంభం

దోస్త్ 2023 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఎన్జీ కళాశాల నందు శనివారం హెల్ప్‌లైన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా 'దోస్త్' కోఆర్డి నేటర్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు మాట్లాడుతూ దోస్త్ రిజిస్ట్రేషన్ నందు విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే ఎన్జీ కాలేజీలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. హెల్ప్‌లైన్ సెంటర్ సిబ్బంది వారి సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు.

ఉరేసుకుని యువకుడి బలవన్మరణం

చౌటుప్పల్ : ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని చింతలగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని ఈస్ట్‌మిడ్నాపూర్ ప్రాంతంలోని కోట్లాపురి గ్రామానికి చెందిన బుధదేబ్‌బేరే(21) గత నెల రోజుల క్రితం తన బావ శ్యాంసుందర్ పుట్టుమైతీతో కలిసి చౌటుప్పల్‌లో 132కెవీ విద్యుత్ లైన్ పనులు చేసేందుకు వచ్చారు. అందులో భాగంగా రోజువారీ మాదిరిగానే మండలంలోని చింతలగూడెం శివారులో జరుగుతున్న పనికి వెళ్లాడు. సాయంత్రం పని ముగిసాక తన బావతో కలిసి అదే గ్రామంలో ఉన్న తన గదికి చేరుకున్నాడు.భోజనం చేశాక రాత్రి 10గంటలకు చింతలగూడెంలోని తన సైట్‌కు నైట్ వాచ్ డ్యూటీ కోసం మరో యువకుడైన సందీప్‌మైతీతో కలిసి వెళ్లాడు. బుధదేబ్‌బేరే అర్ధరాత్రి సమయంలో ఫోన్‌లో మాట్లాడుతుండగా మరో యువకుడు నిద్రపోయాడు. ఆ క్రమంలో తెల్లవారుజామున తన గది సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధదేబ్‌బేరే ఒక అమ్మాయిని ప్రేమిస్తున్నాడని, ప్రేమ కారణాలతోనే మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి బావ శ్యాంసుందర్ పుట్టుమైతీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సైదులు తెలిపారు.

గరిష్ట నీటిమట్టానికి అడుగు దూరంలో..



నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

- నిండుకుండలా మూసీ ప్రాజెక్టు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టానికి కేవలం ఒకే ఒక దూరంలో ఉంది. హైదరాబాద్ నగరంతో పాటు మూసీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నెల రోజుల నుంచి మూసీలోకి ఇన్‌ఫ్లో వస్తుండటంతో నీటిమట్టం ఒక్కో అడుగు పెరుగుతూ వస్తోంది శనివారం ఎగువ నుండి మూసీకి 680 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా శనివారం సాంత్రానికి 643.50 అడుగులకు చేరుకుందని అధికారులు పేర్కొన్నారు. కేవలం మరో అడుగు నీరు చేరితే ప్రాజెక్టు గేట్లు పైకెత్తే అవకాశముంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది.